

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 305 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 19 - 05 - 2025 | పేజీలు : 6


## హైదరాబాదు గుల్జార్ హౌస్ లో భారీ అగ్ని ప్రమాదం

- చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో చెలరేగిన మంటలు
- భవనం మొదటి అంతస్తులో భారీగా ఎగసిపడ్డ అగ్నికీలలు
- మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు
- ఈ ఘటనపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు

**హైదరాబాదు, మే 18, జనస్వరం :** హైదరాబాద్ లో ఆదివారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున చార్మినార్ సమీపంలో ఉన్న గుల్జార్‌హౌస్‌లో మంటలు చెలరేగాయి. భవనం మొదటి అంతస్తులో భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఈఘటనలో చనిపోయిన వారి సంఖ్య 18కు చేరింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన గురించి ఆరా తీశారు. అధికారులను అడిగి ప్రమాదానికి సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ ను వెంటనే ప్రమాదాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. మంటల్లో చిక్కుకున్న కుటుంబాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పోలీస్, అగ్నిమాపక విభాగం చేపడుతున్న చర్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. ఘటనా స్థలాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా సందర్శించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి అగ్నిప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ లో ఆదివారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ లో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో నాలుగు కుటుంబాలు భవనంలోనే చిక్కుకుపోయాయి. మంటల తీవ్రతకు ఎనిమిది మంది సజీవదహనమయ్యారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారని సమాచారం. స్థానికుల సమాచారంతో వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది బిల్డింగ్ లో నుంచి పదహారు మందిని కాపాడారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న వారిలో పదహారు మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. గాయపడిన వారిని ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో, అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.

ఆదివారం ఉదయం చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురి కలిచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ప్రధాని... క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50వేల పరిహారం ఇస్తామని తెలిపారు. కాగా,



గుల్జార్‌హౌస్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఇప్పటివరకు 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు ఉన్నారు. ఇవాళ ఉదయం భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది కాపాడి యశోద (మలక్‌పేట), ఉస్మానియా, డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రులకు తరలించారు. గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి... మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు శివారు ప్రాంతాల్లో ఇటీవలి సంవత్సరాలలో వరుస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి ప్రమాదం జరిగిన తర్వాత, అగ్నిమాపక భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, నివాస ప్రాంతాల్లో అక్రమంగా వాణిజ్య సంస్థలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ, పరిస్థితిలో మార్పు రావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది జూలైలో జియాగూడ ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 ఏళ్ల బాలిక మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫర్నిచర్ గోడౌన్‌లో చెలరేగిన మంటలు మూడు అంతస్తులకు వ్యాపించాయి. నవంబర్ 2023లో, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న నాంపల్లిలోని ఓ భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో పది మంది మరణించగా, 12 మంది గాయపడ్డారు. ఎయిర్ కూలర్ల ఫైబర్ బాడీల తయారీకి ఉపయోగించే రసాయనాలను నిల్వ ఉంచిన గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు మొదలయ్యాయి. పై మూడు అంతస్తులలో అద్దెకు ఉంటున్న ఆరు కుటుంబాలు మంటల్లో చిక్కుకున్నాయి. మార్చి 2023లో సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ఆరుగురు మరణించారు. కాంప్లెక్స్‌లోని 5వ అంతస్తులో మంటలు చెలరేగడంతో 13 మంది చిక్కుకుపోయారు. ఏడుగురిని కాపాడగలిగినప్పటికీ, నలుగురు మహిళలతో సహా ఆరుగురు పొగ పీల్చడం వల్ల ఊపిరాడక మృతి చెందారు.

## మళ్లీ ఉద్ధృతంగా కరోనా వ్యాప్తి...



- ఆసియా దేశాల్లో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- హాంకాంగ్, సింగపూర్‌లలో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య అధికం
- వ్యాక్సిన్ రోగనిరోధక శక్తి తగ్గడమే కారణమంటున్న నిపుణులు
- LP.8.1, XFC కొత్త వేరియంట్ల వ్యాప్తిపై ఆందోళన
- ప్రజలు బూస్టర్ డోసు తీసుకోవాలని వైద్య నిపుణుల సూచన
- నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌కు అమెరికా FDA ఆమోదం

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో, ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్ వంటి ఆసియా దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గత కొన్ని వారాలుగా ఇన్ఫెక్షన్ల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా, ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య కూడా అధికమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, ఈ నగరాల్లో కోవిడ్ కేసులు, ఆసుపత్రి చేరికలు, మరణాలు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది వ్యాక్సిన్ల ద్వారా లభించిన రోగనిరోధక శక్తి క్రమంగా తగ్గడం, LP.8.1, XFC వంటి కొత్త వేరియంట్ల వ్యాప్తి దీనికి కారణంగా నిపుణులు భావిస్తున్నారు. దీంతో ప్రజలు ముందుజాగ్రత్తగా కరోనా బూస్టర్ డోసు తీసుకోవాలని, ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్‌ను కూడా పరిగణించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో, పెరుగుతున్న ముప్పును దృష్టిలో ఉంచుకుని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA) నోవావాక్స్ సంస్థ అభివృద్ధి చేసిన కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం తెలిపింది. అమెరికాకు చెందిన అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఈ రూప్ ప్రకారం, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎల్‌పీ.8.1 వేరియంట్ కారణంగా కేసులు అధికమవుతున్నాయి. నమోదవుతున్న కేసుల్లో సుమారు 70% ఈ వేరియంట్ వల్లేనని, మరో 9% కేసులకు ఎక్స్‌ఎఫ్‌సీ వేరియంట్ కారణమని ఆయన తెలిపారు. ఒమిక్రాన్ అసలు వేరియంట్ స్థానంలో దాని ఉప వేరియంట్లు వ్యాప్తిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కొత్త వేరియంట్లు తీవ్ర ప్రాణాంతకమైనవి కానప్పటికీ, తగ్గిన రోగనిరోధక శక్తి వల్ల సులభంగా వ్యాప్తి చెందుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి ఎల్‌పీ.8.1 వేరియంట్ యూకే, ఆస్ట్రేలియా సహా అనేక దేశాల్లో ప్రభావం చూపుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) జనవరిలోనే ఎల్‌పీ.8.1ను 'అండర్ మానిటరింగ్ వేరియంట్'గా గుర్తించింది. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్...!

**హైదరాబాదు, మే 18, జనస్వరం :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సినిమా ఎగ్జిబిటర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1వ తేదీ నుంచి థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతమున్న అద్దె (రెంటల్) పద్ధతిలో థియేటర్లను నడపడం తమకు సాధ్యం కావడం లేదని, కేవలం సినిమా వసూళ్లలో వాటా (పర్సంటేజీ) పద్ధతిని అమలు చేస్తేనే థియేటర్లను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ రోజు (ఆదివారం) హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్ల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, డి. సురేష్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎగ్జిబిటర్లు తమ సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను నిర్మాతలకు వివరించినట్లు సమాచారం. థియేటర్ల నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయని, అద్దె పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. "అద్దె ప్రాతిపదికన థియేటర్లను ఇకపై నడిపించలేం. మాకు పర్సంటేజీ రూపంలోనే వాటా కావాలి. అప్పుడే మాకు గిట్టుబాటు అవుతుంది," అని వారు



తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ మేరకు తమ డిమాండ్లను, నిర్ణయాన్ని వివరిస్తూ నిర్మాతలకు అధికారికంగా ఒక లేఖ రాయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, జూన్ 1 నుంచి విడుదల కావాల్సిన పలు సినిమాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా చిత్రాల విడుదలకు ఇబ్బందులు తలెత్తవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎగ్జిబిటర్ల నిర్ణయంతో తెలుగు సినిమా పరిశ్రమలో కొత్త చర్చ మొదలైంది. ఈ సమస్యకు నిర్మాతలు, ఎగ్జిబిటర్లు కలిసి ఎలాంటి పరిష్కారం కనుగొంటారో చూడాలి.

## డాక్టర్ గా మారిన మంత్రి నాదెండ్ల!

**తెనాలి, మే 18, జనస్వరం :** రాజకీయ వేత్తగా, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా నిత్యం ప్రజాసేవలో తలమునకలై ఉండే నాదెండ్ల మనోహర్, శనివారం కొల్లిపరలో ఓ కొత్త అవతారమెత్తారు. వైద్యుడిలా మారి, సామాన్య ప్రజలతో మమేకమై, వారి ఆరోగ్య సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ, వారికి అండగా నిలిచారు. తెనాలి నియోజకవర్గం, కొల్లిపర మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో (సీహెచ్‌సీ) ఆయన చొరవతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం ఈ అపురూప దృశ్యానికి వేదికైంది. ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. "గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ఆర్థిక ఇబ్బందుల వల్ల గానీ, దూర ప్రాంతాలకు వెళ్లలేని కారణంగా గానీ వైద్య సేవలు పొందలేకపోతున్న ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ భారీ వైద్య శిబిరంలో సుమారు 20 మంది వివిధ విభాగాల నిపుణులైన వైద్యులు, 50 మంది సహాయ సిబ్బంది పాల్గొని సేవలందించారు. స్త్రీల ఆరోగ్యం, చిన్నపిల్లల వైద్యం, చెవి-ముక్కు-గొంతు, కంటి, దంత, గుండె సంబంధిత వ్యాధులకు నిపుణులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఎక్స్‌రే, స్కానింగ్ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి చిన్నపాటి శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే నిర్వహించారు.



## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 19 మే 2025
తిథి : శుద్ధి విదియ ( మ : 2.01 వరకు )
నక్షత్రం : ధనిష్ఠ ( తె 5.52 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు
రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు
యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు
వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు

## ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 19 మే 2025
ఫజర్ : 5.35 ఉదయం
సూర్యోదయం : 6.48 ఉదయం
జొహార్ : 12.34 మధ్యాహ్నం
అసర్ : 3.52 సాయంత్రం
మఘ్రిబ్ : 6.19 సాయంత్రం
ఇష : 7.32 సాయంత్రం


జన స్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా



# జగన్‌కు నిద్రలేని రాత్రులు..! వైసీపీ ఇన్నర్ టాక్ !

## ఎడిటోరియల్

వైసీపీ అధినేత జగన్‌కు నిద్రలేని రాత్రులు నడుస్తున్నాయా? పదే పదే ఆయన న్యాయవాదులు.. పార్టీ ముఖ్యులతో మాట్లాడుతున్నారా? తాజాగా జరుగుతున్న పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. ''మేం అనుకున్నట్టుగా పరిణామాలు అయితే లేవు. ఏదో మా ర్పు కనిపిస్తోంది. ఇది మాకు ప్రమాకర సంకేతాలు ఇస్తోంది.'' అని గుంటూరుకు చెందిన సీనియర్ మోస్ట్ నాయకుడు, వయోవృద్ధుడు లోగుట్టుగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జగన్ వచ్చే నాలుగేళ్ల తర్వాత గురించి ఆలోచిస్తున్న విషయం తెలిసిందే. మనదే ప్రభుత్వం ప్రజలు మనవెంటే ఉన్నారన్న వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్టీ నాయకులను కూడా ఆయన అదే దిశలో నడిపిస్తున్నారు. అలాగే నడవాలని కూడా చెబుతున్నారు. కానీ, వాస్తవానికి.. వచ్చే నాలుగేళ్ల తర్వాత ఏమో కానీ.. ఇప్పుడు మాత్రం పార్టీ పరిస్థితి తీవ్ర సంకటంలో పడిపోయింది. మద్యం కుంభకోణంలో కీలక వ్యక్తుల అరెస్టులు.. జైళ్లు భయపెడుతున్నాయి. ''ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు!'' అని కొన్నాళ్ల కిందట జగన్ వ్యాఖ్యానించారు. కానీ, ఆయన ఊహించిన దానికంటే కూడా ఎక్కువగానే జరుగుతుండడం పార్టీలో ఇబ్బందిగా మారింది. ఒకరు అరెస్ట యితే ఓకే.. కానీ.. వరుస పెట్టి అందరూ అరెస్టయ్యారు. మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారిలో ప్రతి ఒక్కరూ ఇప్పుడు జైల్లోనే ఉన్నారు. తాజాగాధనుంజయరెడ్డి,కృష్ణమోహన్‌కూడాజైలుకువెళ్లారు.ఈపరిణామానికి



తోడు..ఇప్పటికే జైల్లో ఉన్న వంశీకి బెయిల్ రావడం లేదు. వచ్చినా.. వేర్వేరు కేసులు నమోదవుతున్నాయి. దీంతో జగన్ పరిస్థితి దారుణంగా ఉందన్నది పార్టీ నాయకులు చెబుతున్న మాట. అయితే.. ఎవరూ బయటకు చెప్పడం లేదు. కానీ, అంతర్గత సంభాషణల్లో మాత్రం వైసీపీ అధినేతకు నిద్ర పట్టడం లేదన్నది మాత్రం స్పష్టంగా చెబుతున్నమాట. ఒకానొక సందర్భంలో ఫ్రెస్ట్రేషన్‌కు కూడా జగన్ గురవుతున్నారని అంటున్నారు. ''అందుకే అధికారం కోల్పోకుండా చూడాలని చెప్పా!'' అని ఇటీవల చేసిన వ్యాఖ్యలను వారు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరులోనే ఉన్నా.. నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని.. ప్రముఖ న్యాయవాదులతోనూ చర్చిస్తున్నారని సమాచారం. మరి ఏం చేస్తారో చూడాలి.

## ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసుల ముమ్మర రాత్రి గస్తీ

**విజయవాడ, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా రాత్రి గస్తీని కట్టుదిట్టం చేశారు. అనుమానితులపై నిఘా, నెంబర్ లేని వాహనాల గుర్తింపు, అక్రమ రవాణా అడ్డంపెట్టేందుకు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసు కమీషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ప్రతి రాత్రి ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. వాహన తనిఖీలు, లాడ్జీలు, హోటల్లు, నిర్జన ప్రాంతాలలో విచారణలు కొనసాగుతున్నాయి. ప్రజలలో భద్రతా భావం కలిగిస్తూ, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా ముమ్మర గస్తీని అమలు చేస్తున్నారు. శనివారం రాత్రి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో సంబంధిత ఎస్.హెచ్.ఓ.ల ఆధ్వర్యంలో గస్తీ నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్యం రాత్రి సమయాల్లో రోడ్డెక్కి సమగ్ర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజల ప్రశాంత



జీవనానికి భద్రత గట్టి చేయాలన్న లక్ష్యంతో నెంబర్ లేని వాహనాలు, మత్తుపదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడింది. లా & ఆర్డర్ సిబ్బంది ముఖ్య ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టి అనుమానాస్పద స్థితిని సకాలంలో గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు.

## జిల్లాలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

**- సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి బలంగా వెళ్తాం**
**- ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**

**విజయవాడ, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** స్థానిక సెంట్రల్ నియోజకవర్గం 36వ డివిజన్ శారదా కాలేజ్ సెంటర్లో జన సేన పార్టీ నాయకులు రుద్ర శేఖర్ నాయుడు ఆధ్వర్యంలో జెండా దిమ్మ ఆవిష్కరణ, మజ్జిగ చలివేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ప్రతి ఒక్క జనసైనికుడికి పిలుపునిచ్చారు. డివిజన్ స్థాయిలో జనసేన పార్టీ లక్ష్యాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడం, పార్టీకి ఆకర్షితులుగా ఉన్న వారిని పార్టీలో చేర్చడానికి కృషి చేయాలన్నారు. కూటమిలో భాగ్యస్వామ్యమైనందుకు ప్రతి ఒక్క కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారం కొరకు అధికారుల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పార్టీలో కార్యకర్తగా ఉంటూ రుద్ర శేఖర్ నాయుడు పార్టీ బలోపేతం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజల వద్దకి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు బలంగా వెళ్లాలని కోరారు. ఈ



కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లిశెట్టి వంశీ కృష్ణ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, నగర ఉపాధ్యక్షులు కామల్ల సోమనాథం, జగ్గయ్యపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ రావు, జనసేన పార్టీ కార్పొరేటర్లు మహదేవపు అప్పాజీ, మరుపిళ్ల రాజేష్, సెంట్రల్ ఆంధ్ర జోన్ కో కన్వీనర్ కొప్పిరెడ్డి సూర్య నారాయణమూర్తి (ఎస్ఎన్ మూర్తి), కృష్ణా పెన్నా రీజియన్ కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు అజయ్ ఠాకూర్ వర్మ, డాక్టర్ కొండవీటి సంతోష్ కృష్ణ, విజయవాడ నగరానికి చెందిన పలువురు డివిజన్ అధ్యక్షులు, జనసైనికులు, వీరమహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం పరిధిలో పెద్దపులి సంచారం : భయాందోళనలో భక్తులు

**శ్రీశైలం, మే 18 (జనస్వరం) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానం పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పెద్దపులి ఆ పరిసర ప్రాంతాల్లో సంచరించటం భక్తులు భయాందోళనకు గురయ్యారు. దేవస్థానం పరిధిలోని భ్రామరి పుష్పవనం వద్ద పెద్దపులి సంచరించిది. ఈ మధ్యకాలంలో శ్రీశైలం సున్నిపెంట పరిసర ప్రాంతాల్లో తరచుగా పెద్ద పులులు, చిరుత పులులు ఎక్కువగా దేవస్థానం పరిసర ప్రాంతాల్లో తారసపడుతున్నాయి. క్రూర జంతువుల సంచారంతో భక్తులు భయాందోళన చెందుతున్నారు. పట్టపగలే పుష్పవనం వద్ద పెద్దపులి కనిపించటంతో భక్తులు భయాందోళన గుర్రై పరుగులు తీశారు. గత నెలలో ఓ పూజారి ఇంటిలోకి చిరుత పులి వచ్చిన విషయం పాఠకులకు తెలిసింది. గత 15 రోజుల క్రితం కూడ చిరుతపులులు అటవీ ప్రాంతం నుంచి వెలుపలికి రావడం జరుగుతుంది. అటవీ ప్రాంతంలో నీటి కొరత



తోనే ఈ జంతువులు బయట ప్రపంచానికి వస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ శాఖ అధికారులకు దేవస్థానం సిబ్బంది సమాచారం ఇవ్వగా అటవీ శాఖ అధికారులు వచ్చి పెద్దపులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు.

## శ్రీశైలం జలాశయం వద్ద ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు


**శ్రీశైలం, మే 18 (జనస్వరం) :** శ్రీశైలం జలాశయంలో ప్లంజ్ పూల్ పరిస్థితిని అంచనా వేసేందుకు కర్నూలు ట్రిపుల్ ఐటీ కళాశాల (డిజైనింగ్, మాన్యుఫ్యాక్చరింగ్) అధ్యాపకులు శనివారం పర్యటించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో ప్లంజ్ పూల్ స్థితిపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లంజ్ పూల్ పరిస్థితిని అంచనా వేసేందుకు అండర్ వాటర్ డ్రోన్‌తో పరిశీలించామన్నారు. నీటి అడుగున లోతైన ప్రాంతాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. దెబ్బతిన్న భాగాలను స్పష్టంగా గుర్తిస్తే తగిన చర్యలు తీసుకొనేందుకు ప్రాజెక్టు అధికారులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తొలకరి రాకతో అరక పట్టిన రైతన్న

**- దుక్కులకు అనుకూలించిన వాతావరణం**
**- ఖరీఫ్ కు సన్నద్ధమవుతున్న అన్నదాత**

**పులివెందుల, మే 18 (జనస్వరం) :** తొలకరి చినుకులు రావడంతో రైతన్నలు అరక పట్టారు. వాతావరణం కూడా అనుకూలించడంతో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల రెండు రోజుల క్రితం పదును వానలు రావడంతో అన్నదాతలు క్షణం తీరిక లేకుండా పొలంగట్లపైనే ఉన్నారు. వేసవి దుక్కులకు సమయం కావడంతో అన్నదాతను తొలకరి పలకరించింది. ప్రకృతి అనుకూలించడంతో ఈ దపా ఖరీఫ్ సీజన్ లో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు వీలుంటుంది. ముఖ్యంగా ఖరీఫ్ లో వేరుశనగ సాగించడం పరిపాటి. అయితే గత కొంత కాలంగా వేరుశనగకు ఖర్చులు తడిసి మోపెడంత కావడం. వాతావరణం ప్రతికూలించడం, అదును దాటి వచ్చిన వానలు మేలు చేయక పోవడం, అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర లేకపోవడం ఇత్యాది కారణాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఖరీఫ్ లో వేరుశనగ సాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై సారించారు. ఏరువాక పౌర్ణమి లోపు దుక్కులు పూర్తి చేసుకుంటారు. తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల పదును వర్షాలు పడితే రైతుకు అంతకు మించిన ఆనందం



మరొకటి ఉండదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశిస్తాయని, నెల 27వ తేదీన కేరళను తాకనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు ఇదివరకే వెల్లడించారు. ఈ ఏడాది కూడావర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో అన్నదాతలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే చినుకులు రావడంతో వాతావరణంలో కూడా మార్పు చోటు చేసుకుంటుంది. మరిన్ని బలమైన వర్షాలు పడితే వాతావరణం చల్లగా మారుతుంది. దీంతో రైతులు కూడా వ్యవసాయంపై మరింత ఉత్సాహం చూపే ఆకాశం ఉంది. ఏది ఏమైనా ఖరీఫ్ సాగుకు సర్వం ఎదురొడ్డి పోరాడుతున్న అన్నదాతకు పకృతి అన్ని విధాల సహకరించాలని ఆశిద్దాం.. ఆకాంక్షిద్దాం...

## కూటమి పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం : మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి

**పులివెందుల, మే 18 (జనస్వరం) :** కూటమి పాలనలో పాఠశాల విద్యా వ్యవస్థ అస్త వ్యస్తం అయిందని, భ్రష్టుపట్టిందని రాజ్యసభ మాజీ సభ్యులు, డాక్టర్ ఎన్ తులసి రెడ్డి విచారం వెలిబుచ్చారు. ఆదివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలని మూడు రకాల పాటశాలలుండేవని, అందరికీ సౌకర్యంగా,సౌలభ్యంగా ఉండేవన్నారు. వైసీపీ పాలనలో శాటలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్+, ప్రి హై స్కూల్, హై స్కూల్, హై స్కూల్+ అని ఆరు రకాల స్కూల్లు పెట్టి అయోమయం చేయడం జరిగిందన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్లు కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యను 9 రకాలుగా విభజించి చీలికలు పేలికలుగా చేసిందన్నారు. హై స్కూళ్ళలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40 బదులు 1:53 చేసిన ఫలితంగా 6,428 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలారన్నారు. ఈ నేపథ్యంలో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డీఎస్సీ ప్రశ్నార్థకమయిందన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా జీఓ 85ను రద్దు చేయకపోగా మరింత పకడ్బందీగా అమలు చేస్తోంది. ఆ విధంగా టిడిపి కూటమి మాట తప్పిందన్నారు. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ లో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడం చారిత్రిక తప్పిదమని,



దీనివలన ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుంది. తెలుగు దేశం పార్టీ పేరును ఇంగ్లీష్ దేశం అని మార్చుకుంటే సరిపోతుందని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. .ప్రాథమిక పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని తెలుగు మాధ్యమం లో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలలో, ఉద్యోగాలలో 3 శాతం అదనపు మార్కులు కలపాలి. కాంగ్రెస్ పాలనలో వున్నట్లే పాఠశాల విద్యలో 3 రకాల పాఠశాలలు మాత్రమే ఉండాలి. ఉన్నత విద్య లో ఉపాధ్యాయుల,విద్యార్థుల నిష్పత్తి 1:40 గా వుండాలి. మెగా డీఎస్సీ ని యధాతథంగా నిర్వహించి పాఠశాలలు తెరిచే లోపే ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి వెల్లడించారు.

## ఇచ్చిన హామీలను ఏడాది లోపే నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది : బొబ్బేపల్లి సురేష్ నాయుడు

**సర్వేపల్లి, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఇచ్చిన హామీలను ఏడాది లోపే నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి అంకితమై పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం సంకల్పబద్ధంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. వృద్ధాప్య పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మత్స్యకారులకు భృతి, విద్యార్థులకు బ్యాగుల పంపిణీ – ఇలా అన్ని రంగాల్లో హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చురుగ్గా పనిచేస్తోందని ఆయన అన్నారు. దేశానికి సేవ చేసిన స్వతంత్ర సమరయోధుల పేర్లను పథకాలకు నామకరణం చేయడం ఒక గొప్ప పరిపాలనా విలువగా ఆయన అభివర్ణించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో, కేంద్రంలో నరేంద్ర మోదీ




సహకారంతో, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం పదవిలో బాధ్యతలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర దిశగా తీసుకువెళ్తున్నారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతిని వెలికితీస్తూ, దోపిడీకి పాల్పడినవారిపై చర్యలు తీసుకునే ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం సైన్యం వెనుక నిలబడే విధంగా, యువతలో దేశభక్తిని పెంపొందించే విధంగా పాలన కొనసాగుతోందని, ఇది మంచి కాలానికి సంకేతమన్నారు. ఈ సమావేశంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, సుబ్రహ్మణ్యం, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, అశోక్, మస్తాన్, చిన్న, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# పెంటపాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఒక్కరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు**
**- ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న విషాద ఘటన**
**- గ్రామంలో తీవ్ర విషాదం**

**చింతపల్లి, మే 18 (జనస్వరం) :** మండలంలోని రౌరింతాడ గ్రామ సమీపంలోని చింతపల్లి–నర్సీపట్నం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని విషాదంలో ముంచేసింది. పెంటపాడు గ్రామానికి చెందిన నల్లాల చంద్రరావు (38), భార్య కృష్ణవేణి (32), అన్నయ్య కుమారుడు అఖిలేష్ (13) కలిసి చిట్రాలగొప్పు గ్రామంలోని బంధువుల రజస్వల కార్యక్రమానికి హాజరై తిరిగివస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. భద్రాచలం నుండి విశాఖపట్నం వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఏపీ31జెడ్0335 గల బస్సు సీలేరు, జీకే వీధి, చింతపల్లి మీదుగా వెళ్తున్న బస్సు రౌరింతాడ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. బస్సు ఢీకొట్టిన తీరులో వాహనం పూర్తిగా దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో చంద్రరావు చేతులు, కాళ్లు విరిగిపోగా, కృష్ణవేణికి తలపై బలంగా గాయమైంది. అఖిలేష్ రెండు కాళ్లు విరిగిపోయాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు అప్రమత్తంగా స్పందించి 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి తక్షణమే చేరుకుని ముగ్గురినీ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స అందించే సమయంలోనే చంద్రరావు మృతి చెందారు. మిగతా ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.









# లగ్జరీ కారు స్కోడా కోడియాక్ హైదరాబాదులో ఆవిష్కరించిన పీపీఎస్ మోటార్స్

**హైదరాబాద్, మే 19 (జనస్వరం) :** భారతదేశంలో 25 ఏళ్లుగా, ప్రపంచవ్యాప్తంగా 130 సంవత్సరాలుగా ప్రసిద్ధి చెందిన స్కోడా ఇండియా కొత్త తరం కోసం స్కోడా కోడియాక్ వాహనాన్ని ఆవిష్కరించింది. ఇది సరికొత్త తరం 4x4 ఎస్‌యూవీ. హైదరాబాద్ కాండాపూర్‌లోని పీపీఎస్ మోటార్స్ స్కోడా షోరూమ్‌లో దీన్ని ఆవిష్కరించారు. 2025 సంవత్సరం స్కోడా ఆటోకు భారతదేశంలో కొత్త యుగానికి తలుపులు తెరిచింది. ఈ యుగంలో ఇది తన తొలి ఉప-4ఎమ్ ఎస్‌యూవీ అయిన కోడియాక్‌ను విడుదల చేసింది. విశేష రికార్డు ఏడాది కూడా ప్రీమియం పోర్ట్‌ఫోలియోలో బ్రాండ్‌ను కొనసాగిస్తుంది. భారతదేశంలో తన కోడియాక్ లగ్జరీ 4x4 ఎస్‌యూవీ ఆవిష్కరణతో, భారతదేశంతో పాటు అంతర్జాతీయంగా కూడా రెండో తరానికి కొత్త కోడియాక్ చేరువైంది. ఈ సరికొత్త కోడియాక్ కారు లగ్జరీ, రిఫైన్‌మెంట్, ఆఫ్-రోడ్ సామర్థ్యం, రోడ్డు డైనమిక్స్‌తో ఏడు-సీట్లలో అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జానెబా మాట్లాడుతూ, మార్చి నెలలో భారతదేశంలో ఒక నెల అమ్మకాలలో అత్యధిక విజయం సాధించామని తెలిపారు. కైలాక్‌ను ఆవిష్కరించడం, ఆ తర్వాత కుషాక్, స్లావియా వలన ఇది సాధ్యమైంది. ఈ సంవత్సరం సాధించాలనుకునే అనేక కొత్త రికార్డుల్లో ఇది ఒకటి. ఉత్పత్తులతో దూకుడుగా ముందుకు వెళ్లాలన్న మా వ్యూహానికి అనుగుణంగా సరికొత్త కోడియాక్ ఆవిష్కరణతో స్కోడా కార్ల విలాసం, సాంకేతికత మరింత ముందుకు సాగింది. ఆక్టేవియా, సూపర్బ్‌లాగే ఇప్పుడు కోడియాక్ కూడా మా వారసత్వ పేరుగా అభివృద్ధి చెందింది. నగరాల్లోని రోడ్లతో పాటు ఏ భూభాగం మీదైనా వెళ్లగలిగే అద్భుతమైన సామర్థ్యం మరియు హ్యాండ్లింగ్‌ను ఇది అందిస్తుంది అని చెప్పారు. కారు ఆవిష్కరణను పురస్కరించుకుని పీపీఎస్ మోటార్స్ ఎండీ రాజీవ్ సంఘ్వీ మాట్లాడుతూ, స్కోడా సంస్థ నుంచి అందరూ ఎంతో ఎదురుచూస్తున్న ప్రీమియం ఎస్‌యూవీ సరికొత్త స్కోడా కోడియాక్‌ను పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. అసాధారణ డ్రైవింగ్ అనుభవాన్ని ఇచ్చేలా రూపొందిన ఈ కొత్త కోడియాక్‌లో అత్యాధునిక టెక్నాలజీ, ప్రీమియం ఫీచర్లు, బోల్డ్, డైనమిక్ డిజైన్ అన్నీ కలవని పేర్కొన్నారు.




# ఎయిడ్స్ స్మారక దినం సందర్బంగా కొవ్వొత్తుల ప్రదర్శన

**పులివెందుల, మే 18 (జనస్వరం) :** ఎయిడ్స్ తో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం అలాగే హెచ్ఐవితో పోరాడుతూ జీవిస్తున్న వారి కోసం మేమున్నామని భరోసా ఇవ్వాలని నగరిగుట్ట పట్టణ ప్రాంతీయ ఆసుపత్రి డాక్టర్ స్నేహ ప్రత్యూష ఆధ్వర్యంలో ఆదివారం పులివెందులలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఈ కార్యక్రమం పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి నుండి పులివెందుల ఐసీటీసీ విభాగం, సీడీఎస్, స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ ని నగరిగుట్ట పట్టణ ప్రాథమిక ఆసుపత్రి వైద్యురాలు స్నేహ ప్రత్యూష ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడి మరణించిన వారి ఆత్మ శాంతి చేకూరాలని అలాగే హెచ్ ఐ వి వ్యాధి తో జీవిస్తున్న వారి కి మేమున్నామని భరోసా ఇస్తూ వారి జీవన ప్రమాణాన్ని పెంచేందుకు కృషి చేయవలసిన బాధ్యత మనందరిదన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ, ఎస్ టీ ఐ కౌన్సిలర్ లు వెంకటసుబ్బయ్య, బాదల్ వలి, డీపీఎం సుబ్బారెడ్డి, సీడీఎస్ మేనేజర్ వలి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మరియు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మినీ మహానాడును జయప్రదం చేయండి: మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు

**నెల్లూరు, మే 18 (జన స్వరం) :** నియోజకవర్గ కేంద్రమైన వింజమూరులో సోమవారం ఉదయం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన జరగనుందని, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమం వింజమూరులోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో జరుగనుండగా, మండల తేడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండల టిడిపి నాయకులు సోమవారం ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పిడుగు రమేష్, మురళి, సుబ్బారెడ్డి, కానాల సిద్ధయ్య, తోట మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 19న అన్నవరంలో జరిగే "మహానాడు"ను విజయవంతం చేయండి – ఎమ్మెల్యే సత్యప్రభ పిలుపు



**ప్రత్తిపాడు, మే 18 (జనస్వరం) :** ఈ నెల 19న, సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి అన్నవరంలోని హరిహర రిస్టారెంట్స్ అండ్ కన్వెన్షన్ కళ్యాణ మండపంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ "మహానాడు" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఈ మహానాడు నిర్వహించబడుతోందని, ప్రత్తిపాడు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందని అన్నారు. "నా భర్త స్వర్గీయ వరుపుల రాజా మహానాడు వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో పేరు పొందారు. అదే ఒరవడిలో నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జరిగే మొట్టమొదటి మహానాడును ఘనవంతంగా జరపాలి" అంటూ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే విధంగా, ఈ నెల 22న కాకినాడలో జరగబోయే జిల్లా మహానాడును, అలాగే స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించబోయే రాష్ట్ర మహానాడుకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లాలని సూచించారు.

# రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**ప్రత్తిపాడు, మే 18 (జనస్వరం) :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం కాలేజీ గ్రౌండ్‌లో దివంగత నేత స్వర్గీయ వరుపుల జోగిరాజు (రాజా) జ్ఞాపకార్థం బోదిరెడ్డి గోపి యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దివంగత నేత రాజా గారి పేరుతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందదాయకమైన విషయం అని తెలిపారు. రాజా గారు క్రీడలంటే, ముఖ్యంగా క్రికెట్ పట్ల ఎంతో ఆసక్తి చూపించేవారని, ఆయన జ్ఞాపకాలను యువతలో సజీవంగా ఉంచడంలో ఈ టోర్నమెంట్ దోహదపడుతుందని అన్నారు. యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని, శారీరకంగా మరియు మానసికంగా తమను అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎన్డీఏ కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేతలకు బహుమతులను ప్రకటించారు: మొదటి బహుమతి: రూ. 50,000 (షీల్డ్‌తో), ద్వితీయ బహుమతి: రూ. 30,000 (షీల్డ్‌తో), తృతీయ బహుమతి: రూ. 15,000 (షీల్డ్‌తో).

# ఆపరేషన్ సింధూర్ తో భారత సైన్యం సత్తా పాకిస్తాన్ కి అర్థమైంది



**దెందులూరు, మే 18: (జనస్వరం) :** ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద శిబిరాలను మట్టుపెట్టిన భారత సైన్యం సత్తా ఏమిటో పాకిస్తాన్ కు అర్థమైందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారత సైన్యాన్ని కీర్తిస్తూ దెందులూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన తిరంగా ర్యాలీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దెందులూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఉగ్రవాదుల ఏరివేత చేపట్టిన భారత సైన్యానికి యావత్తు దేశ ప్రజలు మద్దతుగా నిలిచారని తెలిపారు. యుద్ధభూమిలో వీర మరణం పొందిన మురళీనాయక్ దేశభక్తిని చాటి చెప్పి, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఎంపీ పేర్కొన్నారు. తిరంగా ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ సైనికులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి శాలువాలు కప్పి సన్మానించారు.

# జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ఏలూరు, మే, 18 : ( జన స్వరం) :** రానున్న మూడు రోజులపాటు కోస్తా జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జిల్లాలోని అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఏలూరు కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 1800 233 1077 తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, గంటకి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవిన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. . ప్రతి మండలం ప్రధాన కేంద్రంలో, డివిజన్ ప్రధాన కేంద్రాలలో రెవెన్యూ సిబ్బంది 24x7 అందుబాటులో ఉండాలని తెలిపారు, పకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండి ముందస్తుగానే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.

# బోనమెత్తిన దేగాం గ్రామం ప్రజలు - అంగరంగ వైభవంగా బోనాల పండుగ

**భైంసా, మే 18 (జన స్వరం) :** దేగాం గ్రామంలో ప్రతి సంవత్సరం మే నెలలో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పరంపరను కొనసాగిస్తూ ఆదివారం మహిళలు పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను మోసుకొని, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా, వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పెద్దమ్మ తల్లికి బోనాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పాడి పంటలు మరియు వ్యాపారాల్లో అధిక లాభాలు వచ్చేటట్లు కరుణ చూపాలని గ్రామ ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎం. లిగ్గం, ఉపాధ్యక్షుడు సిద్దల దత్తు, క్యాషియర్ సట్ల నరేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





జనస్వరం
www.janaswaram.com
తెలంగాణ

# ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

**పులివెందుల మే 18 (జనస్వరం) :** స్థానిక వైఎస్ చిన్నకొండారెడ్డి రజక కాలనీ యందు నూతనంగా వైయస్ కుటీంబీకుల ఆశీస్సులతో రూ.35 లక్షలతో నిర్మించిన గంగమ్మ తల్లి దేవస్థాన ప్రతిష్ట కార్యక్రమం కనుల విందుగా జరిగింది, రామకుమార్ దీక్షితుల వారి మంత్రోచ్ఛరణ తో ముఖ్య అతిథిగా హాజరైన వైయస్ మనోహర్ రెడ్డి గారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, గ్రామస్తుల అందరూ హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమం లో మునిసిపల్ ఛైర్మెన్ వరప్రసాద్, మాజీ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, వైఎస్సార్సీపీ పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, వైసీపీ సీనియర్ నాయకులు కోడి రమణ, గుణకనపల్లి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు, తదనంతరం పిఎమ్మార్ కన్స్ట్రక్షన్ అధినేత మహేశ్వర్ రెడ్డి కుమారుడు తేజా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# మహానాడును జయప్రదం చేయండి జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత

**పులివెందుల, మే 18 (జనస్వరం) :** కడప నగరంలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవిత టిడిపి శ్రేణులకు సూచించారు. కడపలో ఆదివారం మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆమె అనంతపురం వెళుతూ మార్గమధ్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడపలో మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చంద్రబాబు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ జన సమీకరణ చేయాలని ఆమె టీడీపీ నాయకులు కార్యకర్తలకు సూచించారు.



# ఆర్మీ జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి

**బొంరాస్‌పేట్, మే 18 (జనస్వరం):** బొంరాస్‌పేట్ మండల పరిధిలోని సాలిండాపూర్ యువకులు ర్యాలీగా మండల కేంద్రానికి చేరుకొని, ఆర్మీ జవాన్ మురళి నాయక్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్, శ్రీను నాయక్, మొగులయ్య గౌడ్, రవి గౌడ్, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# సింధూర్ విజయోత్సవ ర్యాలీలో బిజెపి శ్రేణులు

కిర్లంపూడి మే 18, ( జనస్వరం ) : భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ పై జరిగిన యుద్ధంలో విజయం సాధించడంతో భారతదేశమంతా తరంగ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. దీనిలో భాగంగానే జగ్గంపేట నియోజకవర్గంలోని బిజెపి నాయకులు పార్టీ శ్రేణులు సింధూర్ విజయోత్సవ ర్యాలీ లో భారతదేశ జండాలను పట్టుకుని నువ్వు వెన్నెల జెండా నువ్వు రెపరెపలాడించారు. జగ్గంపేట నియోజకవర్గంలో సింధూర్ విజయోత్సవం ర్యాలీలో కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు ముఖ్య అతిథులుగా విచ్చేయగా జగ్గంపేట నియోజవర్గం ఇంచార్జ్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో మన కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.





# వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై అవగాహన కార్యక్రమం

**శేరిలింగంపల్లి, మే 18 (జనస్వరం) :** ప్రొఫెషనల్స్ ఫర్ వన్ నేషన్ - వన్ ఎలక్షన్ పై అవగాహన, అభిప్రాయ సేకరణలో భాగంగా ఆదివారం రోజు రాజ్ భవన్ రోడ్ లోని క్షత్రియ హోటల్ లో వివిధ రిటైర్డ్ ఆర్మీ అధికారులు, సంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, మేధావులు, న్యాయవాదులు, వైద్యులు మరియు ప్రజలతో సమావేశం నిర్వహించి ఒక దేశం - ఒక ఎన్నిక పై అవగాహన, అభిప్రాయాలు తెలుసుకోవడం కోసం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో హాఫిజ్ పేట్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్, ఓబీసీ మోర్చా నాయకులు బోయిని అనూష మహేష్ యాదవ్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ గారు,కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి, వన్ నేషన్-వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ జీ, వన్ నేషన్-వన్ ఎలక్షన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాంచెందర్ మరియు వివిధ ముఖ్య నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ యొక్క కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# త్వరలో రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ డబ్బులు
## మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**కొత్తచెరువు, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టో మేరకు అర్హులైన ప్రతి రైతుకు త్వరలో ప్రభుత్వం వారి ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తుందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులకు ఏడాదికి రూ.20 వేలు మూడు దశల్లో వారి ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత రైతుల వివరాలు ఆయా మండల వ్యవసాయ శాఖ అధికారుల వద్ద సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కొత్త చెరువు మండలంలో జరిగిన పలు వివాహానికి అదివారం హాజరైన సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకొనే పిల్లలు ఉంటే అంతమందికి జూన్ లో తల్లికి వందనం కింద వారికి రూ.15 వేలు ప్రభుత్వం జమ చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆగస్టులో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మిగతా హామీలను దశలవారీగా తూచా తప్పకుండా అమలు చేసి తీరుతామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడించారు. ఏపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3వేల పించన్ 4 వేలకు పెంచి మూడు నెలలకు ఒకేసారి 65 లక్షల కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేసి నిరూపించుకుందన్నారు. అంతేగాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 16,500 టీచర్ ఉద్యోగాల భర్తీని త్వరలో చేపడుతోందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్షన్ రద్దు చేసిన విషయాన్ని మాజీ మంత్రి గుర్తు చేశారు. అంతే కాకుండా ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా కూటమి ప్రభుత్వం నెరవేర్చి మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. అనంతరం కొత్తచెరువు మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డులో లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరిగిన తలమర్ల వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారికి మాజీ మంత్రి చేతుల మీదుగా నూతన వస్త్రాలను బహుకరించారు. కొత్తచెరువు మండలంలోని పాత దేవరపల్లిలో చెన్నకేశవస్వామి



ఆలయంలో జరిగిన శ్యామపురం వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి హాజరయ్యారు వరుడు యశ్వంత్ వధువు శ్రావణీలను ఆశీర్వదించి వారికి వస్త్రాలు అందజేశారు. అక్కడి నుండి పుట్టపర్తి మండలం వీడుపల్లి అభయాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో జరిగిన మేడా వారి వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి హాజరయ్యారు నాగ సాయి వర్ధిని మణికంత వివాహానికి హాజరై నూతన వధూవరులను మాజీమంత్రి ఆశీర్వదించారు వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కూటమి పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "డయల్ యువర్ కమిషనర్" సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపే దిశగా సోమవారం నిర్వహించనున్న "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండని కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. వేసవికాలం ఎండల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తా మన్నారు. అలాగే నేరుగా రాలేని వాళ్లు తమ సమస్యను ఫోన్ ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపేందుకు 9.30 నుండి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

# "గరుడ వారధి" నిర్వహణ పట్టదా?

**తిరుపతి, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తిరుపతిలో విపరీతంగా పెరిగిన యాత్రికులు, ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్మింపజేసిన గరుడ వారధి ఫ్లై ఓవర్ నిర్వహణ మున్సిపల్ అధికారులకు, నిర్మాణ కాంట్రాక్టర్ కు పట్టదా? అని బీజేపీ సీనియర్ నేత, సామాజిక సేవాకర్త నవీన్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన తిరుపతి వీవీ మహల్ రోడ్డులోని తన కార్యాలయంలో ఫ్లైఓవర్ నిర్వహణపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ... ఫ్లై ఓవర్ పరిశీలిస్తే నిర్వహణ సక్రమంగా చేస్తున్నారా అనే అనుమానాలు నగర ప్రజలలో కలుగుతున్నాయన్నారు. గరుడ వారధి నిర్వహణ లోపం కారణంగా ట్రాఫిక్ సమస్యలతో యాత్రికులకు, నగర ప్రజలకు శాపంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి పవిత్రతను దృష్టిలో ఉంచుకొని యాత్రికుల, నగర ప్రజల సౌకర్యార్థం గరుడవారధికి పునాది రాయి వేశారని, హైదరాబాద్ "నెక్లెస్ రోడ్" తరహాలో విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా ఉండాల్సిన గరుడ వారధి కళావిహీనంగా మారడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. గరుడ వారధి నిర్వహణ లోపం, అధికారుల నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు నాయుడుకి లేఖ రాస్తానని నవీన్ పేర్కొన్నారు. గరుడ వారధి 2019లో 694 కోట్లతో ప్రారంభమైందని, అందులో 600 కోట్లు ఫ్లైఓవర్ కు, 90 కోట్లు స్మార్ట్ స్ట్రీట్స్, మెయింటెనెన్స్, కాలువల నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రతి 2 సంవత్సరాలకోసారి రోడ్ అండ్ సేఫ్టీ ఆడిట్ జరిపించాల్సిన బాధ్యత టిటిడి, నగరపాలక సంస్థ, స్మార్ట్ సిటీ అధికారులపై ఉన్నా అలాంటి భద్రతా పరీక్షలు జరిగిన దాఖలాలు కనపడటం లేదన్నారు. అలా రోడ్ అండ్ సేఫ్టీ ఆడిట్ జరిగితే వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగినప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణంలో ఏదైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే గుర్తించి వెంటనే సరి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అయితే గరుడ వారధి ఫ్లైఓవర్ కింద ఉన్న లీలామహల్ నుంచి లక్ష్మీపురం, శంకరంబాడి సర్కిల్, పద్మావతి పురం పైభాగం వరకు ఉన్న జంక్షన్ల, డివైడర్ల బ్యూటిఫికేషన్ నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్ దే అయినా గాలికి వదిలేసారని మండిపడ్డారు. డివైడర్ల మెయింటెనెన్స్ సక్రమంగా లేకపోవడంతో కళావిహీనంగా దర్శనమిస్తుందన్నారు. గరుడ వారధి 5 సంవత్సరాల నిర్వహణ కోసం సుమారు 25 కోట్లతో అదే కాంట్రాక్టర్ కు అప్పజెప్పడం అందులో కొంత నిధులు విడుదల చేయడం



జరిగినా నిర్వహణ లోపం కారణంగా ట్రాఫిక్ సమస్య పెరగడం, నగర ప్రజలకు యాత్రికులకు శాపంగా మారిందన్నారు. తిరుపతిలో వర్షం పడితే గరుడ వారధి ఫ్లైఓవర్ కింద ఉన్న ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తున్నాయని దానికి కారణం కాలువ నిర్మాణాలను చేపట్టకపోవడమే అన్నారు. టిటిడి - నగరపాలక సంస్థ - స్మార్ట్ సిటీ - గరుడ వారధి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం సర్టిఫికెట్ తీసుకొని 5 సంవత్సరాలు సక్రమంగా పూర్తి నిర్వహణ చేపట్టేలా ఆదేశాలిచ్చి ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా నగర ప్రజలలో అనుమానాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు.

# 21 నుంచి శ్రీ వీరాంజనేయ స్వామి జయంతి మహోత్సవాలు



**- ఆరు రోజుల పాటు వైభోపేతంగా జరగనున్న స్వామి వారి ఉత్సవాలు**
**- కరపత్రాలు ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు**

**గుంటూరు మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఈ నెల 21 నుంచి శ్రీనివాసరావుతోటలో వేంచేసియున్న శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్సులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాలకు సంభందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21న అంకురార్పణ, 22 స్వామి వారి కళ్యాణం, 23 హోమం, 24న పురవీధుల్లో స్వామి వారి రధోత్సవం , 25 సింధూర పూజ, 26న పదివేల మందికి అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు. ఆలయ పూజారి కోగంటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పూజాది హోమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఆరు రోజుల పాటు అత్యంత వైభోపేతంగా భక్తి శ్రద్దలతో జరిగే ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనవలసినదిగా వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పుప్పాల నాగయ్య సభ్యులు బలరామస్వామి, కోటేశ్వరరావు, కేశవదాసు, ఆంజనేయులు, శివ నాగేశ్వరావు, శివ, శానం కనకలక్ష్మి, శంకర్, కోనేటి రాయల్, నరసింహారావు, సుబ్బారావు, ఆళ్ళ హరి తదితరులు పాల్గొన్నారు.

# మంచి చేసే టీడీపీకూటమి ప్రభుత్వాన్ని ఆదరించండి

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో ముందడుగు**
**- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

**పుట్టపర్తి, మే 18 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ప్రజలకు మంచి చేస్తున్న టిడిపికూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం అమగొండ పాల్యంలో ఆదివారం జరిగిన గంగమ్మ జాతరకు హాజరైన సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులతో రాష్ట్రం ప్రగతి పథంలో ముందడుగు వేస్తోందని అన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఒకవైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రధాన రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం తో దేశంలో అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు పుట్టపర్తి మండలం బీడు పల్లి అభయాంజనేయ స్వామి దేవాలయం లో జరిగిన మేడా వారి వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి హాజరై నూతన వధూవరులు సాయివర్ధిని వెడ్స్ మణికంఠలను ఆశీర్వదించారు. మాజీ మంత్రి తోపాటు పుట్టపర్తి మండల కన్వీనర్ విజయ్ కుమార్ టీడీపీ సీనియర్ నాయకులు శ్రీరామ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి ,సర్పంచ్ శ్రీనివాసులు ,నాగరాజు, పుల్లప్ప, కృష్ణ, కేశవ, సూరి, స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆమడ గూరు మండలం పూలకుంట్లపల్లి లో మృతి చెందిన టీడీపీ కార్యకర్త హైదర్ వలీ 40 రోజుల దిన కర్మ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై ఆ కుటుంబాన్ని పరామర్శించారు. హైదర్ వలీ మృతి ఆ కుటుంబానికే కాకుండా టీడీపీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అన్ని విధాలుగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తిరంగా యాత్రను జయప్రదం చేయండి



**పులివెందుల, మే 18 (జనస్వరం) :** పులివెందులలో సోమవారం జరగబోయే తిరంగా యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ స్టేట్ మార్క ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ పహల్గమ్ ఉగ్రదాడికి ప్రతి చర్యగా భారతభూమి పై దాడి చేస్తే పర్యావసానం ఎలా ఉంటుందో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ లోని 11 ఉగ్ర స్థావరాలను ఆపరేషన్ సింధూర్ ద్వారా ధ్వంసం చేసి, ముఖ్యమైన ఉగ్రవాదులను అంతమొందించి మన సైనిక శక్తిని ప్రపంచానికి తెలియచేశామన్నారు. ఇది మన త్రివిధ దళాలు సాధించిన ఘనవిజయం.ఈ విజయం మన సైనికుల వీరత్వానికి, మన దేశ శక్తి సామర్థ్యాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సైనికులకు, దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సంఘీభావం తెలియజేస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5:00 గంటలకు అంబేద్కర్ సర్కిల్ దగ్గర్నుంచి పూల అంగళ్ళ సర్కిల్ వరకు దేశభద్రతలు ప్రజల భాగస్వామ్యం పేరుతో జరిగే తిరంగా యాత్ర లో మువ్వన్నెల జాతీయ జెండా చేతబట్టి నియోజకవర్గంలోని పౌరులందరూ పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విన్నవించారు.

# మొమ్మెల మునిబాబుకు డాక్టరేట్ ప్రదానం

**పులివెందుల, మే 18 (జనస్వరం) :** నియోజకవర్గంలోని లింగాల మండలం కామ సముద్రం గ్రామానికి చెందిన ముమ్మెల నాగమ్మ, చిన్న మునెయ్య దంపతుల కుమారుడు మునిబాబుకు డాక్టరేట్ ప్రదానం చేశార. మునిబాబు ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటి లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న మొమ్మెల ముని బాబు జె.ఎన్.టి.యు. అనంతపూర్ లో వీడియో ట్రాన్స్మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఇన్ వైర్ లెస్ నెట్ వర్క్ నందు పరిశోధనను జె.ఎన్.టి.యు అనంతపూర్ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లో పని చేస్తున్న ప్రొఫెసర్ పాకనాటి చెన్నారెడ్డి, కర్నూలు పుల్లా రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ గా పని చేస్తున్న రాచపూడి ప్రవీణ్ శ్యామ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల పి.హెచ్.డి పూర్తి చేశారు. ఈ రోజు జె.ఎన్.టి.యు. అనంతపూర్ లో ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ గౌరవనీయులైన అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగిన పద్నాలుగవ స్నాతకోత్సవంలో వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఒరిజినల్ పి. హెచ్. డి. డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటి లోని డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పెనుకొండ రవి కుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్. సి. హెచ్. రత్న కుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు, స్వగ్రామమైన కామసముద్రం గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు ముమ్మెల. ముని బాబుకు వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఒరిజినల్ పి.హెచ్.డి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.




# ప్రజా పరిపాలనలో చంద్రబాబు విఫలం



**పాలకొల్లు, మే 18 (జనస్వరం) :** పరిపాలన చేయడంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని, రాష్ట్రం అప్పుల ఊబిలో మునిగి అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా మారుతోందని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. ఆదివారం పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రం ఇష్టానుసారం చేస్తున్న అప్పుల విషయంలో, కాగ్ రిపోర్టు ఇచ్చిన విషయం తెలిసిందేనని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కర్రా జయసరిత డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కూడా వాటిని అమలు చేయుడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె విమర్శించారు. సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది పాలనలో ఎంత సంపద సృష్టించారో ప్రజలకు వివరించాలని ఆమె డిమాండ్ చేశారు. సంపద సృ ష్టించడం మాట అటుంచి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారన్నారు. కాగ్ నివేదిక ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్ పార్టీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, పసుపులేటి కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# రూ.450 కోట్లతో నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం

**- కేంద్ర ప్రభుత్వం నుంచి లభించిన పరిపాలన ఆమోదం**
**- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి**



**ఉంగుటూరు, మే 18: (జనస్వరం) :** ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కేవలం ఒక్క ఉంగుటూరు నియోజకవర్గంలోనే నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పరిపాలన ఆమోదం లభించిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఉంగుటూరు, చేబ్రోలు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్న ప్రదేశాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం పర్యవేక్షించడం వల్ల రాష్ట్రంలోనే మొదటి సారి ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీ తెలిపారు. భీమడోలు, కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు వద్ద రూ. 450 కోట్ల అంచనా వ్యయంతో ఆర్ఓబిల నిర్మాణం ఆరేడు నెలల్లో ప్రారంభమవుతుందని ఎంపీ పేర్కొన్నారు. వీటి నిర్మాణం వల్ల రైల్వే ట్రాక్ ల వద్ద గంటల తరబడి నిరీక్షించే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీ వెల్లడించారు. రానున్న నాలుగేళ్లలో మిగిలిన రైల్వే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. రైల్వే సమస్యలు పరిష్కరించాలని అడిగిన వెంటనే సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల మంజూరుకు శక్తి వంచన లేకుండా కృషి చేసినట్లు ఎంపీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు , టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిరంతరం చర్చిస్తున్నారని ఎంపీ తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలే కాకుండా ఇతరత్రా అభివృద్ధి పనులను ఎంపీ మహేష్ కుమార్ సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎంపీ మహేష్ కుమార్ పనిచేస్తున్నారని తెలిపారు.

# ఈనెల 19న జిల్లాకు రానున్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

**ఏలూరు, మే18:( జన స్వరం) :** జిల్లా ఇన్చార్జి మంత్రి,రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు విజయవాడ నుండి బయలుదేరి మధ్యాహ్నం 12:30 కు ఉంగుటూరు చేరుకుంటారు. స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 2.00 గంటలకు ఉంగుటూరు నుండి బయలుదేరి మధ్యాహ్నం 2:30 కు ఏలూరు రెవిన్యూ గెస్ట్ హౌస్ కి చేరుకుంటారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ గోదావరి సమావేశంలో నిర్వహించే జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.00 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్తారు.



# భక్తులతో కళకళ లాడుతున్న మల్లన్న సన్నిధి

**- స్వామివార్ల దర్శనానికి 4 గంటల సమయం**



**శ్రీశైలం, మే 18 (జన స్వరం) :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల సన్నిధి భక్తుల రద్దీతో కళకళలాడుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతో క్షేత్రంలో భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. శ్రీశైలం పురవీధులన్నీ భక్తులతో నిండి సందడిగా మారాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర మరియు ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం రాత్రి శ్రీశైలాన్ని చేరుకున్న భక్తులు, వేకువజామున నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి అమ్మవారి దర్శనార్థంగా శీఘ్ర, ఆతిశీఘ్ర, ప్రత్యేక క్యూలైన్లు మరియు కంపార్టుమెంట్లలో బారులు తీరారు. శ్రీ స్వామి అమ్మవారి ఉచిత దర్శనానికి సుమారు 4 గంటలు, స్పర్శ దర్శనానికి ఒక గంట సమయం పడుతోందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో భక్తులకు అల్పాహారం, పాలు, బిస్కెట్లు, మంచినీరు తదితర సౌకర్యాలు అందజేస్తున్నారు.

# స్వామివార్లకు పల్లకీ ఉత్సవం

**శ్రీశైలం, మే 18 (జన స్వరం) :** శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీ భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి వారికి పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణం కోసం దేవస్థానం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూళ నక్షత్రం రోజుల్లో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవంలో భాగంగా, లోకకల్యాణాన్ని కోరుతూ అర్చకులు, వేదపండితులు ముందుగా మహా గణపతి పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి వారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేసి, స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో వేంచేపు చేశారు. పల్లకీని వివిధ రకాల పుష్పాలతో అద్భుతంగా అలంకరించి భక్తులకు దర్శనార్థంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు మరియు వేద పండితులు పాల్గొన్నారు.



# పెనుకొండలో మినీ మహానాడు

పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈరోజు పెనుకొండ శాసనసభ్యులు మంత్రివర్యులు సవితమ్మ గారి సూచనల మేరకు వివిధ మండలాల తెదేపా కన్వీనర్లు, తెదేపా నాయకులు ఈ రోజు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు గారి జన్మదినం పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రతి మే నెలలో మొదలు 27, 28, 29 తేదీలలో రాష్ట్రస్థాయి తెదేపా మహానాడు మహాసభ ఏర్పాటు చేసుకోవడం జరుగుతోంది, అందులో భాగంగా నియోజకవర్గస్థాయి మహానాడు, జిల్లా స్థాయి మహానాడు సమావేశాలు ఉంటాయి. అందులో భాగంగా పెనుకొండ నియోజకవర్గంలో 21/05/2025 తేదీన ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశంలో వివిధ తీర్మానాలను రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుంది. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పుట్టపర్తిలో 24/05/2025 తేదీన జిల్లా మినీ మహానాడు సమావేశాలు ఉంటాయి. పెనుకొండ నియోజకవర్గంలో మినీ మహానాడు 21.05.2025 (బుధవారం) ఉదయం 11.00 గంటలకు పెనుకొండ ఎమ్మెల్యే, బిసి సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి సవితమ్మ గారి అధ్యక్షతన నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ పరిశీలకులు, పార్టీ ప్రతినిధులతో పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం, మడకసిరా రోడ్డు, పెనుకొండలో నిర్వహించనున్నట్లు కన్వీనర్లు పేర్కొన్నారు. ఈ మినీ మహానాడుకు పెనుకొండ నియోజకవర్గానికి చెందిన పెనుకొండ, సోమందేపల్లి, రోద్దం, గోరంట్ల, పరిగి మండలాల నుండి తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు, వార్డ్ కమిటీ సభ్యులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మినీ మహానాడుకు పెనుకొండ నియోజకవర్గానికి చెందిన పెనుకొండ, సోమందేపల్లి, రోద్దం, గోరంట్ల, పరిగి మండలాల నుండి తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు, వార్డ్ కమిటీ సభ్యులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. `ఈ మినీ మహానాడుకు పెనుకొండ నియోజకవర్గానికి చెందిన పెనుకొండ, సోమందేపల్లి, రోద్దం, గోరంట్ల, పరిగి మండలాల నుండి తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు, వార్డ్ కమిటీ సభ్యులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# సంవత్సరం పాటు కళారాధన రజతోత్సవ వేడుకలు

**నంద్యాల, మే 18 (జన స్వరం) :** కళారాధన వార్షిక సర్వసభ్య సమావేశంలో రామన్నను రెండు సంవత్సరాల కాలానికి నూతన కార్యవర్గంగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళారాధన సంస్థకు 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఏడాది పొడవునా రాష్ట్రస్థాయి సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2000 సంవత్సరంలో 300 మంది కళాకారులతో కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కళారాధన స్థాపించామని, గత 25 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, గతంలో నిర్వహించిన కార్యక్రమాలపై సమగ్రంగా వివరాలు వెల్లడించగా, సభ్యులు వాటిపై సమీక్ష నిర్వహించారు. రజతోత్సవ కార్యక్రమాల క్రమంలో ప్రతి ఏటా వేసవిలో నిర్వహించే 'కళాసాధన' శిక్షణ శిబిరాలు, ఆగస్టులో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 'మాతృభూమికి కళార్చన' కార్యక్రమాలు, రాష్ట్రస్థాయిలో నాటకోత్సవాలు, చిత్రలేఖన పోటీలు, కళా ప్రదర్శనలు, సంగీత, నృత్య ఉత్సవాలు, జానపద కళా రూపాల ప్రదర్శనలు, కవి సమ్మేళనం, అష్టావధానం, భువన విజయం వంటి సాహితీ కార్యక్రమాలు, సదస్సులు, కార్యశాలలు నిర్వహించాలని వార్షిక ప్రణాళికను రూపొందించారు. ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ కళారాధన నంద్యాలలో సాంస్కృతిక కార్యకలాపాలకు చిరునామాగా నిలిచిందని, రాష్ట్ర స్థాయిలో కళారంగ అభివృద్ధికి విశిష్ట సేవలందించిందని ప్రశంసించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.




# పెదపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంతో పాటుగా ఇండోర్ గేమ్స్ " లూడో మరియు స్నేక్ గేమ్స్"

**పెదపాడు, మే 18 (జనస్వరం) :** పెదపాడు శాఖా గ్రంథాలయం నందు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థిని విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ వి. సత్యనారాయణ పాల్గొని "సరోజినీ నాయుడు"జీవిత చరిత్రను విపులంగా తెలియపరిచారు , వీరి తల్లిదండ్రులు డాక్టర్ అఘోరనాథ చటోపాధ్యాయ, సుందరీ దేవి వీరికి తొలి సంతానంగా సరోజినీ నాయుడు ది:13/02/1879 లో జన్మించినారు. వీరు జన్మత కవయిత్రి,వీరిని భారత కోకిల అని ప్రశంసించే వారు. ఆమె కవితలు రచనలకు "కైసర్-ఇ- హింద్" బంగారు పతకాన్ని సరోజిని నాయుడుకి సంపాదించి పెట్టాయి.తరువాత మహాత్మా గాంధీ , నెహ్రూ తో పరిచయాలు వారితో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. 1947 ఆగస్టు 15న భారతదేశనికి స్వతంత్రం వచ్చిన తర్వాత దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కు ఈమె తొలి మహిళా గవర్నర్ గా పనిచేశారని తెలియజేశారు. అనంతరం పాణ్యం రామ శేష శాస్త్రి రచించిన "అనగనగా యదార్ధ గాథలు"అనే పుస్తకం నుండి "పిల్లల పెంపకంలో క్రమశిక్షణ" అనే నీతి కథను రీసోర్స్ పర్సన్ అట్లూరి సతీష్ కుమార్ విద్యార్థులచే చదివించడం, పుస్తక పఠనం చేయించడం, చదవటం నాకు ఇష్టం అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తరువాత ఆటవిడుపులో భాగంగా బాల,బాలికలకు ఇండోర్ గేమ్స్" లూడో మరియు స్నేక్ గేమ్స్"నేర్పించి ఆడించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు 16 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమం అంతయు దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు స్నాక్స్ పంచిపెట్టారు.





# విన్నకోట వారి వివాహ వేడుకలో జనసేన నేత చప్పిడి శ్రీనివాసులు రెడ్డి

**కోవూరు మే 18 (జనస్వరం) :** పడుగుపాడు జలజీవన్ మిషన్ వైస్ చైర్మన్ విన్నకోట రాధాకృష్ణ గారి వివాహ వేడుక కార్యక్రమంలో జనసేన పార్టీ కోవూరు నియోజకవర్గ POC మరియు ఇంచార్జ్ చప్పిడి శ్రీనివాసులు రెడ్డి కోవూరు లోని అనపల్లి కన్వెన్షన్ సెంటర్ నందు వారి వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, జీవించాలని ఆయన ఆశీర్వదించారు. ఈ వేడుకలో కోవూరు మండల సంయుక్త కార్యదర్శి నాగిశెట్టి రఘు, కన్వీనర్ పెద్ది తన్మయి, కొడవలూరు మండల అధ్యక్షులు చెక్క సోలం బాబు, నియోజకవర్గ ఐటీ టీం మున్నేపల్లి చైతన్య, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# షష్టిని పురస్కరించుకుని... శ్రీసుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు!

**శ్రీశైలం, మే 18 (జనస్వరం):** శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య స్వామి (కుమారస్వామి) వారికి షష్టి తిథిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం విశేష పూజలు మరియు హోమం నిర్వహించారు. దేవస్థానం నిర్వహించే అధికారిక సేవలలో భాగంగా ప్రతి మంగళవారం, కృత్తికా నక్షత్రం మరియు షష్టి తిథి సందర్భంగా ఈ స్వామివారికి విశేష అభిషేకం మరియు పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. షష్టి తిథిని పురస్కరించుకుని కార్యక్రమం నిర్విఘ్నంగా జరగేందుకు ముందుగా ఆలయ అర్చకులు, వేదపండితులు మహా గణపతి పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లు మరియు వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా సుబ్రహ్మణ్య స్వామి హోమం ఘనంగా నిర్వహించారు.



